1

# రైతు ఉత్పత్తి దారుల సంస్థలు

## బ్యాంకులు లేదా ఇతర ఆర్థిక సంస్థల నుండి ఋణం ఎందుకు తీసుకుంటాయి?


ఇమ్మానుయేల్ ముర్రే & సి. ఎస్. రెడ్డి

### ముందుమాట

రైతు ఉత్పత్తి దారుల సంస్థల (ఎఫ్.పి.ఓ) ఆర్థిక లావాదేవీల నిర్వహణ కొరకు ఇమ్మానుయేల్ ముర్రే గారి సహాయంతో ఏ.పి.మాస్ (మహిళా అభివృద్ధి సొసైటీ) తయారుచేసిన ఈ కరదీపికలు సులభమైన మరియు ఆచరణాత్మక రీతిలో ఋణం ఎలా తీసుకోవాలి, తీసుకున్న ఋణం ఎలా ఉపయోగించాలి, ఋణం తీసుకోవడంలో సంస్థలకున్న హక్కులు మరియు తిరిగి చెల్లించడంలో వారి బాధ్యతలు, మరియు అవసరమైనప్పుడు మాత్రమే ఋణం తీసుకోవడం, తీసుకున్న ఋణాన్ని సద్వినియోగం చేసుకోవడం కోసం చేయవలసిన మరియు చేయకూడని పనులు ఏమిటి అన్న విషయాలు వివరించడం జరుగుతుంది. ఎఫ్.పి.ఓ ఆర్థిక లావాదేవీల నిర్వహణపై రూపొందించిన ఈ కరదీపిక ఎఫ్.పి.ఓలు బాధ్యతాయుతంగా రుణాలు తీసుకోవడం మరియు ఆ రుణాన్ని సమర్థవంతంగా ఉపయోగించడంపై పాలకవర్గ సభ్యులు, సి.ఈ.ఓ మరియు ఇతర సిబ్బంది యొక్క అవగాహన మరియు వారి సామర్థ్యాలను పెంపొందించడం కొరకు రూపొందించబడింది.

మేము రూపొందించే ఈ కరదీపికలు ఎఫ్.పి.ఓ పాలకవర్గ సభ్యులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంచే నిరంతర వాచకాలుగా ఒక స్వయం అభ్యాసన పద్ధతిలో విడుదల చేస్తున్నందున, ఇది విస్తృతంగా అందరికీ అందుబాటులో ఉండి ఎఫ్.పి.ఓలకు నిరంతరంగా ఉపయోగపడే ఒక కరదీపికగా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాము.

ఈ కరదీపికలు మేము తయారు చేసినప్పటికీ అందరి సలహాలు, అభిప్రాయాలు స్వీకరించి ఎప్పటికప్పుడు అభివృద్ధి చేస్తూ ఉంటాము.




**మీ ఎఫ్.పి.ఓ కు నిజంగా ఋణం అవసరమా?**

**మీకు నిజంగా అవసరమైతే మాత్రమే ఋణం తీసుకోండి**

### ఇక విషయంలోకి వెళదామా?

**అభినందనలు!**

మీరు ఎఫ్.పి.ఓను ఏర్పాటు చేసుకున్నారు, రిజిస్ట్రేషన్ చేసుకున్నారు, అవసరమైన లైసెన్స్‌లను పొంది, సిబ్బందిని నియమించుకొని వ్యాపారం చేస్తున్నారు. ఇన్‌పుట్ మరియు/లేదా అవుట్‌పుట్ వ్యాపారం కూడా మొదలుపెట్టి ఉండవచ్చు. మీ ఎఫ్.పి.ఓకు సభ్య రైతుల వాటాధనము మరియు మీ ఎఫ్.పి.ఓను ఏర్పాటు చేసిన ప్రోత్సాహక సంస్థ నుండి కొంత సహాయం లభించి ఉండవచ్చు.

**ఋణం తీసుకోవాలని అనుకుంటున్నారా? ఋణం తీసుకోవడానికి మీ ఎఫ్.పి.ఓ పై ఒత్తిడి ఏమైనా ఉందా?**

**ఆగండి! అలా చేసేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి**

ఏ ఎఫ్.పి.ఓ కూడా ఏర్పాటైన వెంటనే ఋణం పొందడానికి సిద్ధంగా ఉండదు.

మీ ఎఫ్.పి.ఓ సభ్య రైతుల నుండి వాటా ధనం రూపంలో సమీకరించిన డబ్బును, మరియు మీరు పొందిన మ్యాచింగ్ / ఈక్విటీ గ్రాంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్) మీరు ఋణం పొందడానికి సరిపోవచ్చు.

**అయితే మీ వ్యాపార అవసరాలకు ఋణం నిజంగా అవసరమా?**

**లేదా ప్రమోటర్లు / బయటి వ్యక్తుల నుండి ఒత్తిడి ఉన్నందున మీ ఎఫ్.పి.ఓ ఋణం తీసుకోవాలనుకుంటున్నదా?**

**మీ రైతులు మరియు మార్కెట్‌లకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించి, దాని ఆధారంగా మీరు సమర్థవంతమైన వ్యాపార ప్రణాళికను తయారు చేసుకున్నారా? ఈ సమయం సరైనదేనా ?**




ఋణం తీసుకోవడం ఖర్చుతో కూడుకున్న పని (వడ్డీ మరియు ప్రాసెస్సింగ్ రుసుము), దీనిని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలి. ఈ ఋణము నిర్ణీత సమయంలో తిరిగి చెల్లించాలి. కావున మీరు దీని గురించి కొంత లోతుగా మరియు తీవ్రంగా ఆలోచించాలి!!!

## ఉత్తమ పద్ధతి: ముందుగా మీ ఎఫ్.పి.ఓలో అందుబాటులో ఉన్న సొంత నిధులను ఉపయోగించండి

వాటా ధనం లేదా మ్యాచింగ్/ఈక్విటీ గ్రాంట్ లేదా ఋణం ఇలా ఏ రూపంలో వచ్చినా డబ్బు డబ్బే. దానిని సద్వినియోగం చేసుకోవాలి. కాబట్టి ఋణం తీసుకునే ముందు, మీ వ్యాపార ప్రణాళిక ఆధారంగా అందుబాటులో ఉన్న అంతర్గత నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. మీరు ఏమి చేస్తున్నారో లేదా చేయాలనుకుంటున్నారో, ఉదాహరణకు ఇన్‌పుట్ అమ్మకాలు లేదా అవుట్‌పుట్ మార్కెటింగ్‌తో సంబంధం లేకుండా, ముందుగా మీ వద్ద ఉన్న నిధులను ఉపయోగించుకోండి.

**మీ స్వంత నిధులకు ప్రత్యక్ష ఖర్చులు (వడ్డీలు లేదా అపరాధ రుసుము) ఉండవని మీకు తెలుసా?**

మీ నిధులను ఉత్తమంగా ఉపయోగించడం వలన మీ ఎఫ్.పి.ఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (BoD) ప్రమేయం మరియు యాజమాన్యం పెరుగుతుంది. ఎఫ్.పి.ఓ స్వంత నిధులను ఉపయోగించడం వలన తక్కువ రిస్క్ ఉంటుంది మరియు మీ ఎఫ్.పి.ఓ ఆ అనుభవం నుండి వ్యాపారాన్ని నేర్చుకోవచ్చు. ఉదాహరణకు మీ ఎఫ్.పి.ఓ వద్ద స్వంత నిధులు రూ. 10 లక్షలు ఉన్నట్లయితే, మీరు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు మొదలైన వాటి కొనుగోలు కోసం అదే నిధులను తిరిగి ఉపయోగించడం ద్వారా ఒక సంవత్సరంలో రూ. 50 లక్షల వ్యాపారం చేయవచ్చు. అది వ్యాపారం చేయడంలో మీ ఎఫ్.పి.ఓ పాలక వర్గ సభ్యుల విశ్వాసాన్ని మరియు మీ స్వంత సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. ఈ ప్రక్రియలో మీ ఎఫ్.పి.ఓ వివిధ కంపెనీలతో వ్యాపార సంబంధాలను ఏర్పరుచుకుంటుంది మరియు ముఖ్యమైన సంస్థలు మరియు వ్యక్తుల మధ్య గుర్తింపు పొందుతుంది.

**నేర్చుకోవలసిన పాఠం: ఋణం తీసుకునే ముందు మీ ఎఫ్.పి.ఓ లో అందుబాటులో ఉన్న స్వంత నిధులను తప్పనిసరిగా ఉపయోగించాలి**

# మీ ఎఫ్.పి.ఓ కోసం నిధులను సేకరించడానికి కొన్ని ఇతర మార్గాలు:

## ప్రభుత్వం నుండి గ్రాంట్ / సబ్సిడీలు

ఎఫ్.పి.ఓ లు మరియు రైతు సంఘాల కోసం RKVY / MIDH / PMFME వంటి వివిధ ప్రభుత్వ పథకాల నుండి గ్రాంట్‌లు అందుబాటులో ఉన్నాయి.

మీకు నిజంగా రవాణా వాహనం, సేకరణ కేంద్రం, ప్రాసెస్సింగ్ యూనిట్, రైతు సేవా కేంద్రం మొదలగు సౌకర్యాలు అవసరం లేకుంటే దయచేసి ప్రభుత్వం నుండి అటువంటి గ్రాంట్ లు / సబ్సిడీలను పొందవద్దు. మీరు పూర్తిగా అలోచించి, స్పష్టమైన వ్యాపార ప్రణాళికతో ముందుకు వచ్చినట్లయితే, ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చును. అలాగే అటువంటి పథకాలను పొందడం వల్ల ప్రభుత్వం మీ ఎఫ్.పి.ఓ పై కొంత నియంత్రణ కలిగి ఉంటుంది మరియు స్వప్రయోజనాలు కలిగి ఉండవచ్చని గుర్తుంచుకోండి. మీకు రవాణా వాహనం లేదా సేకరణ కేంద్రం లేదా ప్రాసెస్సింగ్ యూనిట్ అవసరమైతే, మీరు ఎఫ్.పి.ఓల కోసం 75% సబ్సిడీతో మంజూరు చేసే ప్రభుత్వ పథకాలను పొందవచ్చును. అటువంటి సందర్భాలలో మిగిలిన 25% నిధులకు స్థానిక బ్యాంకు నుండి సులభంగా ఋణం పొందవచ్చు. ఈ ఋణము ప్రభుత్వ పథకానికి లింక్ చేయబడి ఉంటుంది. అటువంటి పెట్టుబడి కోసం ఎల్లప్పుడూ ఎఫ్.పి.ఓ పేరు మీద ఋణం తీసుకోవాలే కాని సభ్యుల పేరు మీద తీసుకోరాదు.

## వ్యక్తులు / కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) ఫౌండేషన్ల నుండి గ్రాంట్ లు

ఎఫ్.పి.ఓ స్వంత నిధులను సమర్థవంతంగా వినియోగించారు. ఇప్పుడు మీకు పెట్టుబడి లేదా వర్కింగ్ క్యాపిటల్ ప్రయోజనాల కోసం కొంత మూలధనం అవసరం, మీరు మీ ప్రాంతం లోని అధిక పరపతి కలిగిన వ్యక్తులను (HNI) సంప్రదించవచ్చు లేదా CSR నిధులను గ్రాంట్లుగా అందించగల కొన్ని కంపెనీలు ఎంపిక చేసుకోవాలి. నిధులు అందుబాటులో ఉన్నాయి కదా అని గ్రాంట్లు / నిధులను పొంది ఉచ్చులో పడకుండా జాగ్రత్త వహించండి. మీ ఎఫ్.పి.ఓకి ఇవ్వబడిన ఏవైనా కొన్ని గ్రాంట్ లు నిబంధనలకు లోబడి ఉండవచ్చు!!! ఆ నిధులతో ఏమి చేయాలనే దానిపై పరోక్ష ప్రభావం ఉండవచ్చు!!! ఇది మీ స్వయం ప్రతిపత్తి మరియు స్వతంత్రతను తగ్గిస్తుంది.

## ఋణం తీసుకోవడానికి మీకు అర్హత ఉన్నదా?

ప్రతి ఋణదాత (బ్యాంక్ లేదా ఇతర ఆర్థిక సంస్థ) మీకు లోన్ ఇచ్చుటకు కొన్ని అర్హతా ప్రమాణాలను కలిగి ఉండాలి. మీ ఎఫ్.పి.ఓ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌తో చర్చించి ఋణం కోసం మీ ఎఫ్.పి.ఓ యొక్క అర్హత గురించి "స్వీయ మదింపు పద్ధతిని" చేపట్టండి. మీ ఎఫ్.పి.ఓ పనితీరు తప్పక మెరుగ్గా ఉండాలి. డైరెక్టర్ల బోర్డు రెగ్యులర్ సమావేశాలను నిర్వహిస్తుందా? ఎఫ్.పి.ఓ యొక్క ఆఫీస్ బేరర్లు & ఇతర బోర్డు సభ్యులు ఎఫ్.పి.ఓ పనితీరు గురించి మంచి అవగాహన కలిగి ఉండి మరియు యాజమాన్యాన్ని అభివృద్ధి చేసారా?

ఎఫ్.పి.ఓ స్పష్టమైన విజన్ & వ్యాపార ప్రణాళిక ఉందా? కనీసం 300 మంది వాటాదారులు ఉన్నారా?

ఎఫ్.పి.ఓ మంచి బుక్ కీపింగ్ పద్ధతిని అనుసరిస్తున్నదా? ఎఫ్.పి.ఓ సభ్య రైతులకు కావలసిన సేవలను అందించుచున్నదా? FPO అన్ని చట్టపరమైన & చట్టబద్ధమైన కార్యక్రమాలను చేయుచున్నదా? ఎఫ్.పి.ఓ లోని సభ్యులు ఎఫ్.పి.ఓ సేవలతో సంతృప్తి చెందారా? మొదలగు అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.

## డైరెక్టర్ల నుండి ఋణం

కంపెనీ చట్టాలు డైరెక్టర్లు / బోర్డు నుండి రుణాలు తీసుకోవడానికి అనుమతిస్తాయి. ఇది అందరికి ఆమోదయోగ్యమైన వడ్డీతో ఉండవచ్చు. సభ్యులు/వాటాదారుల నుండి ఋణం తీసుకోవడం నిషేధించబడింది.

### పాఠం

ప్రభుత్వం / CSR / HNIల నుండి గ్రాంట్లు / రాయితీలను పొందాలంటే ముందుగా మీరు కొన్ని విధివిధానాలను పూర్తి చెయ్యాలి. మీ ఎఫ్.పి.ఓ ఏ సమయంలోనైనా స్వల్పకాలిక లాభాల కోసం మీ స్వయం ప్రతిపత్తి మరియు స్వతంత్రతలో రాజీ పడకూడదు!!!

## అమ్మకపుదారుని అప్పులు

మీ ఎఫ్.పి.ఓ పెద్ద మొత్తంలో ఇన్‌పుట్‌లను కొనుగోలు చేస్తున్నట్లయితే, అమ్మకము దారులకు డబ్బు చెల్లించడానికి కొంత సమయం తీసుకుంటే అది కుడా ఆర్థిక వనరుగా ఉంటుంది. పెద్ద రైతులకు ఇది గిట్టుబాటు అవ్వచ్చు. ఇది కష్టం అని చెప్పే ముందు ఈ అవకాశమును ఒకసారి ఆలోచించండి.

## కొనుగోలుదారుల నుండి అడ్వాన్స్

అదే విధంగా, ఎఫ్.పి.ఓ నుండి వస్తువులు మరియు సేవలను కొనుగోలు చేసే సభ్యులనుండి వారు కొనుగోలు చేసే వస్తువులకు చెల్లించవలసిన మొత్తమును పూర్తిగా లేదా కొంత భాగమైనా ముందుగా ఎఫ్.పి.ఓ.కు చెల్లించినట్లయితే, అది కూడా ఎఫ్.పి.ఓకు ఆర్థిక వనరుగా ఉంటుంది.

## స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు / సహకార సంఘాల నుండి ఋణం

ఒక వేళ మీ ఎఫ్.పి.ఓ పరిధిలో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు లేదా సహకార సంఘాలు ఉండి మీ సభ్య రైతులు వాటిలో కుడా సభ్యులు గా ఉన్నట్లయితే మీకు కావలసిన ఋణం కొరకు వారిని కూడా సంప్రదించవచ్చు. ఇది ఇతర మార్గాల కంటే త్వరగా, మరింత సౌకర్యవంతంగా ఉంటుంది మరియు స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు / సహకార సంఘాలు కుడా మీ వ్యాపారంను ప్రోత్సహిస్తాయి. ఋణం పొందుటకు పైన అవకాశాలన్నీ ప్రయత్నించిన తర్వాత కుడా మీ ఎఫ్.పి.ఓ వ్యాపార అవసరాలకు తగినంతగా డబ్బు సరిపోనియెడల, మీరు బ్యాంక్‌లు లేదా ఇతర ఆర్థిక సంస్థల (NBFCs) నుండి తప్పనిసరిగా ఋణం తీసుకోవలసి వుంటుంది.

## మీకు నిజంగా ఋణం అవసరమైనప్పుడు ఋణం తీసుకోవడానికి వెనుకాడకూడదు!!!

ఎఫ్.పి.ఓలకు ఋణాలు ఇవ్వడానికి ప్రధానంగా రెండు రకాల ఋణదాతలు ఉన్నారు. వారు – బ్యాంక్‌లు మరియు ఇతర ఆర్థిక (NBFCs) సంస్థలు. అయితే ప్రతి దానిలో కుడా కొన్ని ప్రయోజనాలు మరియు కొన్ని ప్రతికూలతలు ఉంటాయి. బ్యాంక్‌ల కంటే సమున్నతి, నాబ్ కిసాన్ మొదలగు ఆర్థిక సంస్థల నుండి చాలా త్వరగాను, సులభంగాను ఋణాలు తీసుకోవచ్చు. అయితే ఋణాలు తీసుకోవడానికి అయ్యే ఖర్చులు (వడ్డీ, ప్రాసెస్సింగ్ రుసుము మొదలైనవి) ఎక్కువగా ఉండవచ్చు.

అదే విధంగా, బ్యాంకులు నగదు ఋణ పరిమితిని (CCL) అందించగలవు, అక్కడ మీకు అవసరమైనపుడు కావలసిన మొత్తమును తీసుకొనే వెసులుబాటు వుంటుంది, అదే విధముగా మీకు అవకాశం ఉన్నపుడు రుణాన్ని తిరిగి చెల్లించవచ్చు, కాని ఇతర ఆర్థిక సంస్థలు దానిని అంగీకరించవు.

## ముమ్ముందు మేము ప్రతి అంశాన్ని కుడా మరింత వివరంగా తెలియజేస్తాము

మీకు ఏవైనా ప్రశ్నలు ఉన్నయెడల లేదా మీకు ఏవైనా విషయాలు అర్థం కాకపోతే దయచేసి అడగండి. మీకు కావలసిన సమాచారం మా వద్ద ఉంటే వెంటనే మేము సమాధానం ఇస్తాము లేదా తెలుసుకొని మీకు సమాధానాన్ని అందిస్తాము.

**తదుపరి కరదీపిక : *ఋణం పొందుటకు మన ఎఫ్.పి.ఓకు అర్హత ఉందా?***

**మీ ప్రశ్నలు, సలహాలు, సూచనలకు fpofinance@apmas.org కి మెయిల్ రాయండి**

apmas

Plot 11 & 12, HIG, HUDA Colony, Tanesha Nagar, Near Dream Valley,
Manikonda, Hyderabad - 500089, Telangana.
Phone: +91 - 8413 - 403118
Website: http://apmas.org